## క్లుప్తంగా

### బీచుపల్లి ఆలయాలు కిటకిట



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని పలు ఆలయాలు శుక్రవారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులతో రద్దీగా మారాయి. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు ఆకుపూజ, అభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శివాలయం, కోదండరామ స్వామి ఆలయం, సరస్వతీదేవి ఆలయంతో పాటు అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

### ప్రతి మొక్కను సంరక్షించాలి

మానవపాడు: గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అదనపు డీఆర్‌డీఓ నాగేంద్రం అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం గ్రామాన్ని ఆయన సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ రమణారావు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

గద్వాల: పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తాలో నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా చేపడుతున్న సెల్లార్ నిర్మాణం యజమానిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఉపాధ్యాయురాలు జ్యోత్స్న అడిషనల్ కలెక్టర్ అపూర్వ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. సెల్లార్ నిర్మాణ పనులను పెద్దపెద్ద యంత్రాలతో చేపట్టడం వలన పక్కనే ఉన్న నిర్మాణాల గోడలు దెబ్బ తింటున్నాయని వివరించారు. తక్షణమే అక్రమ నిర్మాణ పనులను నిలిపివేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఐదోరోజుకు చేరిన నిరాహార దీక్ష

అయిజ: మేడికొండ గ్రామాన్ని నూతనంగా మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు చేపట్టిన నిరాహార దీక్ష శుక్రవారం ఐదవ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంగా ప్రకటించే వరకు నిరసలు కొనసాగిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### దరఖాస్తు చేసుకోండి

అయిజ: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ ఎస్‌ఓ చెన్నబసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లలో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

### సీపీఆర్‌పై అవగాహన



గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉద్యోగులకు సీపీఆర్ విధానంపై శుక్రవారం డాక్టర్ రాజు అవగాహన కల్పించారు. సీపీఆర్ చేయడం వల్ల అకస్మాత్తుగా కలిగే గుండెపోటుతో ఊపిరితిత్తులు, మెదడు, గుండెవంటి ప్రధాన భాగాలకు తిరిగి రక్త ప్రసరణ జరిగి మనిషి ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ యాదగిరి, సూపరింటెండెంట్ మదన్‌మోహన్, రాజు, వరలక్ష్మీ, ఎల్లయ్య, వైద్యారోగ్యశాఖకు చెందిన వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



గద్వాల రూరల్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే చాంబర్‌లో శుక్రవారం గద్వాల, మల్దకల్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండు చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హైదర్, బీచుపల్లి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అయిజ: విత్తన, ఎరువుల విక్రయదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఏఓ నాగేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు మండలంలోని వెంకటాపురం స్టేజీలో వివిధ విత్తనాలు, ఎరువుల విక్రయ దుకాణాలపై వ్యవసాయ టాస్క్‌ఫోర్స్ అధికారులు, వ్యసాయ అధికారులు, పోలీసులు దాడులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ పాల్గొన్నారు.

# తూకం చేసినా కష్టాలే..

- ధాన్యం తరలింపులో అధికారుల నిర్లక్ష్యం
- తప్పని పరిస్థితులో దళారులకు విక్రయం



తూకం వేయని మొక్కజొన్న ధాన్యం



జూలెకల్ కొనుగోలు కేంద్రం వద్ద తూకం వేసిన మొక్కజొన్న

శాంతినగర్: ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలను విక్రయించేందుకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతుల కష్టాలు అంతాఇంతా కాదు. మొక్కజొన్నలకు మద్దతు ధర ప్రకటించాలని నెల రోజులుగా రైతులు ఆందోళన చేస్తే ప్రభుత్వం స్పందించి మొక్కజొన్నకు మద్దతు ధరకు రూ.1962 కొనుగోలు చేసేందుకు ముందుకువచ్చింది. ఇటీవల కురిసిన అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు రాత్రింబవళ్లు కల్లాలే వద్దే పడిగాపులు కాశారు. మొక్కజొన్న ఆరిన తర్వాత మార్క్‌ఫెడ్ అధికారులు కాంటా వేశారు. ధాన్యాన్ని తరలించకుండా కల్లాల్లోనే వదిలేయడంతో ఆందోళనకు గురవుతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో 10 కొనుగోలు కేంద్రాలు, గద్వాల జిల్లాలో మల్దకల్‌లో ఒక కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ అధికారులు ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు మొత్తం 42 వేల క్వింటాళ్ల మొక్కజొన్నలు కొనుగోలు చేశారు. వడ్డేపల్లి పీఏసీఎస్ పరిధిలో నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి కొనుగోళ్లు ప్రారంభించారు. జూలెకల్ శివారులోని శివాలయం సమీపంలోని కొనుగోలు కేంద్రం వద్ద 6000 వేల క్వింటాళ్లకు పైగా కొనుగోలు చేసి కాంటా పట్టిన అధికారులు వాటిని తరలించకుండా అలాగే వదిలేశారు. 20 రోజులపాటు ఎదురుచూసి విసుగుచెంది 10 లారీల మొక్కజొన్నలు క్వింటాల్ రూ.1620 నుంచి రూ.1730 వరకు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి.

**దళారులకు ధాన్యం విక్రయం**

మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు ఆందోళనకుగురయ్యారు. కాంటా వేసిన బస్తాలను తరలించకపోవడంతో చేసేదిలేక దళారులను ఆశ్రయించారు. 3 వేల క్వింటాళ్ల కేవలం వడ్డేపల్లి, రాజోళి మండల రైతులు అమ్ముకున్నారు. తనగల, కొంకల, జూలెకల్ రైతులు ఇషాక్ 110 క్వింటాళ్లు, మహేశ్వర్‌రెడ్డి 105 క్వింటాళ్లు, ఏనిగబల పరుశరాముడు 90 క్వింటాళ్లు, తనగల శ్రీనివాసరెడ్డి 95 క్వింటాళ్లు, వీరేష్ 110 క్వింటాళ్లు, రాజన్న 112 క్వింటాళ్లు దళారులకు రూ.1620 నుంచి రూ.1730కి అమ్ముకున్నట్లు వివరించారు.

**నిలిచిన కొనుగోళ్ల ప్రక్రియ**

కాంటా పట్టిన మొక్కజొన్న బస్తాలను తరలించకపోవడంతో 10 రోజుల నుంచి కొత్తగా తెచ్చిన రైతులకు చెందిన మొక్కజొన్నలు కొనుగోలు ప్రక్రియ నిలిపివేశారు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తరచు వర్షాలు కురుస్తుండటంతో టార్పాలిన్‌లు వెంటపెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు చేరుకుంటున్నారు.

**పడిగాపులు కాస్తున్నాం**



నెల రోజులుగా కల్లాల వద్దే జాగరణ చేస్తున్నాం. 15 రోజుల కిందట 96 క్వింటాళ్లు కాంటా వేశారు. ఇప్పటివరకు కల్లాల్లోనే ధాన్యం ఉంది. గోదాములకు తరలించలేదు. పగటి వేళలో టార్పాలిన్ తీయడం రాత్రి వేళలో కప్పడం సరిపోతుంది. వెంటనే బస్తాలు గోదాంకు తరలించి సమస్య పరిష్కరించాలి.

నాగరాజు, రైతు, కొంకల

**దళారులకు అమ్ముకున్నా..**

ధాన్యం కొనుగోలు చేస్తారని 20 రోజులు ఎదురుచూశాను. రెండు రోజుల కిందట శాంతినగర్ దళారికి క్వింటాల్ రూ.1650 అమ్ముకున్నాను. తప్పని పరిస్థితులో దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. అధికారులు నిర్లక్ష్యం వీడాలి. నాతోపాటు 15 మంది రైతులు తక్కువ ధరకు అమ్ముకున్నారు.

శ్రీనివాసరెడ్డి, రైతు, తనగల

**రెండు రోజుల్లో తరలిస్తాం**



లారీలు, హమాలీల సమస్య ఏర్పడటంతో గోదాములకు ధాన్యం తరలించడానికి ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటివరకు 30 వేల క్వింటాళ్లు తరలించాం. మరో రెండు రోజుల్లో కాంటా పట్టిన ధాన్యాన్ని పూర్తిగా తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. అలాగే కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగిస్తాం.

డి.భాస్కర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి

## పకడ్బందీగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఆర్డీఓ రాములు

అయిజ: నిబంధనల మేరకు ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ రాములు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీఎల్‌ఓలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. సకాలంలో ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. తహసీల్దార్ లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్రావ్, ఎంపీడీఓ సాయిప్రకాష్, ఆర్ఐలు మధు, దుర్గాసింగ్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న కంటి వెలుగు

మల్దకల్: మండలంలోని దాసర్‌పల్లి, అమరవాయి గ్రామాల్లోని కంటి వెలుగు కేంద్రాలను శుక్రవారం ఎంపీడీఓ కృష్ణయ్య పరిశీలించారు. వైద్యసిబ్బంది కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, స్వరూపరాణి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని ఆలూరు, తుమ్మలచెరువు, బల్గెర గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగాయి. శుక్రవారం మూడు గ్రామాల్లో మొత్తం 409 మందికి కంటి పరీక్షలను నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇందులో 26 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, మరో 33 మందికి కంటి అద్దాల కోసం ప్రతి పాదనలు పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సమీరా కౌసర్, సాయిచరణ్, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్ఎంలు బారతి, ఖేజీయా, రావేల, ఆయా గ్రామాలకు చెందిన ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గట్టులోని ఆలూరులో..

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో శుక్రవారం 154 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 మందికి కంటి అద్దాలను పంపిణీ, 12 మందికి అద్దాలను రెఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ యాకూబ్ బాషా, చంద్రన్న, శ్రావణి, లక్ష్మినారాయణ, శారద, చిట్టెమ్మ, ఆశాలు ఉన్నారు.

## ఆలయాల్లో అమావాస్య పూజలు



పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో..



జూలెకల్ శివాలయంలో..

ధరూరు: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి, పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి, అల్వలపాడులోని తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి, ఆలయాల్లో శుక్రవారం అమావాస్య పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

గట్టు: మండలంలోని గండి ఆంజనేయస్వామి, మాచర్లలో చెన్నకేశవస్వామి ఆలయాల్లో శుక్రవారం అమావాస్య పురస్కరించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

శాంతినగర్: మండంలోని జూలెకల్ శివారు శివాలయం, ఆంజనేయస్వామివారి ఆలయం, పట్టణంలోని మారుతీనగర్ ఆంజనేయస్వామివారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనైశ్వరుడి జన్మదినం సందర్భంగా తిల, తైలాభిషేకాలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు శివారులోని ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలను పల్లకీ ఊరేగించారు.

**లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ..**

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించినం స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారికి దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవాలి



ఎర్రవల్లిచౌరస్తా: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని జింకలపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల రైతులకు రూ. 50వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బీసన్న, రాంబాబు, రాముడు, నారాయణ, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

### రుణాలను వినియోగించుకోండి

రాజోళి: పాడి పరిశ్రమను అభివృద్ధి కోసం బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని హెరిటేజ్ రీజనల్ హెడ్ సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాన్‌దొడ్డిలో హెరిటేజ్ డైయిరీ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్ బ్యాంకు ద్వారా మంజూరైన రుణాలను అందచేశారు. కార్యక్రమంలో విజయ్ భాస్కర్, మేనేజర్ సిరశాల రాజు, గజేందర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, శ్రీరామ్, జగదీష్, రఫి, సుధాకర్ రైతులు పాల్గొన్నారు.

### రోగుల ఆరోగ్యంపై జాగ్రత్తలు

మల్దకల్: రోగుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ



ఉండవెల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్‌లో వాలీబాల్‌లో విజేతలుగా నిలిచిన యువతకు సర్పంచ్ రేఖ, ఆదర్శ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ శుక్రవారం టీషర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీఓ పాల్గొన్నారు.

## పేదలకు వరం కల్యాణలక్ష్మి

ఉండవెల్లి: పేదలకు కల్యాణలక్ష్మి వరంగా మారిందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వీఆర్ఏలకు పదోన్నతులు, పేస్కేల్ అమలుకు సీఎం కేసీఆర్ ఆమోదించారని, కులవృత్తులకు రూ.లక్ష అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీటీ జయంతి, వైస్ ఎంపీపీ దేవన్న, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సురవరం లోకేశ్వర్ రెడ్డి, సర్పంచులు రేఖ, శివ నారాయణ, ఎంపీటీసీలు సుంకన్న, రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు రమణ, లింగారెడ్డి, మధు, మనోహర్ రెడ్డి, వెంకటేశ్వర్లు గౌడ్, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్రహం రక్తదాన శిబిరం వాల్‌పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. అయిజ మండలానికి చెందిన పులకుర్తి తిరుమల్ రెడ్డి 59వ జయంతి సందర్భంగా సంకాపురం గ్రామ శివారులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

శాంతినగర్: కేసీఆర్ పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో రూ.3 కోట్లతో చేపడుతున్న సెంట్రల్ డివైడర్ విత్ లైటింగ్ సిస్టమ్ పనులకు ఎమ్మెల్యే శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనుల కోసం మంత్రి కేటీఆర్‌తో చర్చించి రూ.10 కోట్లు మంజూరు చేయించానన్నారు. స్పెషల్ గ్రాంట్ ద్వారా వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌కు రూ.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన బెంచీలు, బీరువాలను ఆయన ప్రారంభించారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ కరుణ, జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఎంపీపీ రజిత, మాజీ ఆర్డీఎస్ చైర్మన్ సీతారామిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, రవిరెడ్డి, సుజాత, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కేటీదొడ్డిలోని కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన వీఆర్ఏలు



గట్టులో..

కేటీదొడ్డి: ముఖ్యమంత్రి కేసీఆర్ వీఆర్ఏలకు ఇచ్చిన హమీలను నెరవేర్చేందుకు అంగీకరించడంతో ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్ఏలు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు, కొండయ్య, నాగేంద్ర, కాశీం, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివిధ గ్రామాలకు చెందిన వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. వీఆర్ఏలుకు పే స్కేలు అమలు చేసేందుకు క్యాబినేట్ ఆమోదంపై హర్షం వ్యక్తం చేశారు.

ధరూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా ఎదుట సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిల చిత్రపటాలకు శుక్రవారం వీఆర్ఏలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు ఆంజనేయులు, తిమ్మప్ప, నారాయణమ్మపాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థికసాయం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన నరసప్ప అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ జోగుల రవి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ.10,000 ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట నాయకులు వెంకటన్న, రవి, కృష్ణ, అంజి, తదితరులు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన పెద్ద సుంకన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు శుక్రవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోతురాజు సోమనాద్రి సూచన మేరకు సమాధి ఖర్చుల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు రూ.5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు దేవన్న, యోహాన్, బజారన్న, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



కొండేరులో ఆర్థికసాయం అందిస్తున్న సేవాదళం సభ్యులు

## సుందరయ్య ఆశయాలు కొనసాగిద్దాం



ఉండవెల్లిలోని అలంపూర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నాయకులు

మానవపాడు: దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు కొనసాగిద్దామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య 38వ వర్ధంతిని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాలిక్, రామాంజనేయులు, అంజి, ధనరాజ్, శాంతన్న, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

అలంపూర్ రూరల్: పట్టణంలోని గాంధీచౌక్‌లో సుందరయ్య వర్ధంతిని శుక్రవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆ పార్టీ మండల కార్యదర్శి బి నర్సింహ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగరాజు, మౌలాలి, అయ్యప్ప, సిద్దయ్య, జోగుళాయ్య, అయ్యన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు. క్లబ్... సుందరయ్య ఆశయాలు సాధిద్దాం

ఉండవెల్లి: సుందరయ్య ఆశయాలు సాధిద్దామని సీపీఎం రాష్ట్ర నాయకుడు కిల్లే గోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని అలంపూర్ చౌరస్తాలో పార్టీ కార్యకర్తలతో సమావేశంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మద్దిలేటి, ఈదన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎదుట బి.తిమ్మాపూర్, ఎక్లాస్‌పురం శివారు రైతులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి రైతులకు మద్దతు తెలిపి మాట్లాడారు. బింగుదొడ్డి ఫీడర్‌పై బి. తిమ్మాపూర్ ఫీడర్ కలపడంవలన విద్యుత్ లోఓల్టేజి సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. రెండు రోజుల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని డీఈ లక్ష్మణ్ హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నాను విరమించారు. వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### అందుబాటులో జీలుగ విత్తనాలు

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ మహలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాకెట్‌కు సబ్సిడీ కింద రూ.843లకు విక్రయిస్తునట్లు పేర్కొన్నారు. వరిసాగు చేసే రైతులు తప్పకుండా జీలుగ విత్తనాలు వేసుకోవాలని కోరారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### విస్తృత తనిఖీలు

గద్వాల క్రైం: పట్టణంలోని పలు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, గోదాంలను శుక్రవారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు విస్తృత్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ గోపాల్, బానోత్ పటేల్‌లు మాట్లాడారు. అనుమతి లేకుండా మత్తు పదార్థాలైన క్లోరైడ్, డైజో ఫాంలను కొందరు ట్రాన్స్‌ఫోర్టుల నుంచి దిగుమతి చేస్తున్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామని పేర్కొన్నారు.